క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కుక్కునూరు: ఇటీవల మృతి చెందిన మాజీ వలంటీర్ సరియం రాజు (టింకు) కుటుంబ సభ్యులకు సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాధవరం గ్రామ పంచాయతీలో సరియం రాజు వలంటీర్‌గా పనిచేశాడని, కొద్ది రోజుల క్రితం మృతిచెందాడన్నారు. రాజు కుటుంబానికి పార్టీ నాయకుడు గంజి శ్రీను ఆధ్వర్యంలో రూ.5 వేలు అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎస్సై సంపత్‌కుమార్‌కు అతి ఉత్కృష్ట సేవా పతకం



ఏఎస్సై సంపత్‌కుమార్‌కు సేవ పతకాన్ని అందిస్తున్న ఎస్పీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఏఎస్సై ఎస్వీ సంపత్‌కుమార్ అతి ఉత్కృష్ట సేవా పతకాన్ని అందుకున్నారు. ఇటీవల జరిగిన దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లకు సంబంధించి రికవరీ సొత్తును డీఎస్పీ కార్యాలయంలో బాధితులకు ఎస్పీ కేపీఎస్ కిషోర్ అందజేశారు. చోరీ సొత్తు రికవరీలో సంపత్‌కుమార్ సమర్థవంతంగా పని చేశారని అభినందించారు. కాగా ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన అతి ఉత్కృష్ట సేవా పతకాన్ని ఎస్పీ కిషోర్ సంపత్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం, పోలవరం సర్కిళ్ల డీఎస్పీలు యు.రవిచంద్ర, ఎం.వెంకటేశ్వరరావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అంకాలగూడెంలో కంటి వైద్య సేవలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అంకాలగూడెం గ్రామం కొత్తపేటలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆమెన్ ట్రస్ట్, శంకర నేత్రాలయ ఏలూరు వారిచే నిర్వహించిన వైద్య శిబిరంలో ఆధునిక పరికరాలతో రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు రెండు వందల మందికి పైగా రోగులకు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు ఉచితంగా ఇస్తామని ఆమెన్ ట్రస్ట్ చైర్మన్ ఇవాంజిలి తెలిపారు. శంకర్ నేత్రాలయ డాక్టర్ శర్వానంద్, డాక్టర్ రాజారత్నం, తార, బిందు, చక్రవర్తి, రోషన్ పాల్గొన్నారు.

పరామర్శ



కాశి రాముకు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్: మండలంలోని కమ్మరగూడెంకు చెందిన ఎంపీటీసీ కాశీ ధనలక్ష్మి భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు కాశి రాము అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కాశి రాము చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రక్కు బోల్తా

జంగారెడ్డిగూడెం: స్థానిక పేరంపేట రోడ్డు అయ్యప్పటౌన్‌షిప్ వద్ద ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడింది. కలప చెత్త లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పడంతో రోడ్డు పక్కకు తిరగబడింది. ఈ క్రమంలో అక్కడే పార్క్ చేసి ఉన్న ద్విచక్రవాహనంపై ట్రక్కు పడిపోవడంతో ద్విచక్ర వాహనం ధ్వంసమైంది.

ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేశామని ఆ సంస్థ డైరెక్టర్ ఎం.ఫణికిషోర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో భోజనం, హాస్టల్ వసతి పూర్తిగా ఉచితమన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా టూల్ కిట్టు ఇస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు బ్యాంకు నుంచి సర్టిఫికెట్, అర్హులైన అభ్యర్థులకు ముద్రలోనుకు సిఫారసు చేస్తామన్నారు. వివరాలకు 9948565256, 9533079471 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ఏడాది పాలనలో అంతా మోసం, వెన్నుపోట్లే

- పోలవరంలో పోస్టర్ ఆవిష్కరించిన తెల్లం బాలరాజు
- యర్నగూడెంలో పుస్తకావిష్కరణ చేసిన వనిత
- జంగారెడ్డిగూడెంలో పుస్తకావిష్కరణ చేసిన కంభం విజయరాజు, జెట్టి



పోలవరం: జగన్ అంటే నమ్మకం - చంద్రబాబు అంటే మోసం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెల్లం బాలరాజు



ద్వారకాతిరుమల: యర్నగూడెంలో పుస్తకావిష్కరణ కార్యక్రమంలో వనిత, పార్టీ నాయకులు



జంగారెడ్డిగూడెం: పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కంభం విజయరాజు, జెట్టి గురునాధరావు, నాయకులు

పోలవరం రూరల్: ఏడాది చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలు మోసం, దగా, వెన్నుపోటుకు గురయ్యారని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం పోలవరంలో ‘జగన్ అంటే నమ్మకం - చంద్రబాబు అంటే మోసం’ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజల కోసం పోరాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతలు అక్రమ కేసులు పెట్టి జైళ్లలో వేయడమే కాక, దాడులు కూడా చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ పాలనలో మట్టి, ఇసుక, మద్యం రంగాల్లో విస్తృత స్థాయిలో దోపిడీ జరుగుతోందని, దీంతో రాష్ట్రం అవినీతి ఆంధ్రప్రదేశ్‌గా మారిపోయిందన్నారు. ప్రజల కోసం ప్రశ్నిస్తే కేసులు పెడతారని, ఈ రోజు రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో జగన్‌మోహన్‌రెడ్డిపై అబద్ధ ప్రచారం చేస్తూ ప్రజలను దారి తప్పించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ‘సూపర్ సిక్స్’ హామీలను చంద్రబాబు ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదని తెలిపారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఇప్పుడు అమలులో లేకుండా, రెడ్‌బుక్ రాజ్యాంగమే నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలే చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతారని తెల్లం బాలరాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలు చంద్రబాబు మోసాన్ని గుర్తిస్తున్నారు

ద్వారకాతిరుమల: రాష్ట్ర ప్రజలు చంద్రబాబు మోసాన్ని గుర్తిస్తున్నారని మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ ఏడాది చంద్రబాబు పాలనలో ప్రజలకు చేసిందేమి లేదని అన్నారు. ప్రజలు జగనన్న పాలనను, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకుంటున్నారని, చంద్రబాబు హామీలు నమ్మి ఎందుకు ఓట్లు వేసామా అని ఇప్పుడు అంతా బాధపడుతున్నారని పేర్కొన్నారు. అధికారం కోసం నోటికొచ్చిన హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం వాటి అమలులో ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో వారు చేసిన అసత్య ప్రచారాలు, అబద్ధపు హామీలను ప్రజలు నమ్మి నట్టేట మునిగారని అన్నారు. పాలన సరిగ్గా చేయలేక వైఎస్సార్ సీపీపైన, జగనన్న పైన బురదచిమ్ముతున్నారని ఆమె మండిపడ్డారు. తప్పుడు కేసులు పెట్టి పార్టీ నాయకులను, సోషల్ మీడియా వారిని ఇబ్బందులకు గురి చేస్తూ, జైలు పాలు చేస్తున్నారని అన్నారు. కూటమి పాలనలో ప్రజలు ఎక్కడా సంతృప్తిని వ్యక్తం చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ద్వారకాతిరుమల మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, కాపు నేత పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి తదితరులున్నారు.

మోసం చేయడమే.. నిజాయతీగా నిలబడింది లేదు

జంగారెడ్డిగూడెం: చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలు చేయడమే గాని, ఏనాడు నిజాయతీగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ కమిటీ అధ్యక్షులు చిటికెల అచ్చిరాజు, వామిశెటి హరిబాబు అధ్యక్షతన జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు జెట్టి గురునాధరావుతో కలిసి విజయరాజు మాట్లాడారు. వైఎస్ జగన్ పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, కూటమి ప్రభుత్వ పాలన ఏడాది గడిచినా చెప్పుకోవడానికి ఏమీ లేదన్నారు. సూపర్ సిక్స్ అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని విజయరాజు విమర్శించారు.

వెన్నుపోటు దినంతో వెన్నులో వణుకు

జూన్ 4న నిర్వహించిన వెన్నుపోటు దినంతో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వెన్నులో వణుకు పుట్టిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాధరావు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల హామీలు అమలుచేయకుండా మోసం చేస్తూ వచ్చిందన్నారు. దీనిని నిరసిస్తూ గత ఆరు నెలలుగా ప్రతీ రోజు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రతిరోజు పోరాటాలు చేస్తూ ప్రశ్నిస్తూనే ఉన్నారు. దీనిలో భాగంగా జూన్ 4న నిర్వహించిన వెన్నుపోటు దినంతో కూటమి ప్రభుత్వంలో అంతర్మథనం మొదలైందని, ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందనే భయంతోనే తల్లికి వందనం అమలు చేశారన్నారు. కార్యక్రమంలో ముప్పిడి శ్రీనివాసరావు, మేడవరపు విద్యాసాగర్, కౌన్సిలర్లు ఏపీ రమణమూర్తి, ఎల్.వెంకటేశ్వరరావు, నాయకులు బత్తిన చిన్న, ఓరుగంటి నాగేంద్ర, జెట్టి ఆదిత్య, కె.వెంకటేశ్వరరావు, గురజాల పార్థసారధి, చిప్పాడ వెంకన్న, లీలాధరరెడ్డి, కాసర సోమిరెడ్డి, కృష్ణారెడ్డి, కుక్కల ధర్మరాజు, తమ్మిశెట్టి సాయినాథ్, వాసా రామకృష్ణ, విజయ్, వీరవల్లి సోమేశ్వరరావు, కబీర్, నేత్రగణేష్ తదతరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన అట్టర్ ఫ్లాప్

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు



పుస్తకాన్ని విడుదల చేస్తున్న కంభం విజయరాజు

చింతలపూడి: చంద్రబాబు ఏడాది పాలన పూర్తిగా మోసపూరితమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. పార్టీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొద్దు వెంకటేశ్వరరావు గృహం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రత్యేకంగా ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పేరుతో వైఎస్సార్ సీపీ ముద్రించిన పుస్తకాన్ని పార్టీ నేతలతో కలిసి విజయరాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కూటమి పాలన అంతా అక్రమ అరెస్టులు, దాడుల విధ్వంసమేనని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తానని చెప్పి 2 వేలు కోత విధించారని అన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు పాలనపై అన్ని ఆధారాలతో, వాస్తవాలతో ఈ పుస్తకాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గత వైఎస్సార్ సీపీ పాలనను ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నారని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సువర్ణపాలన అందించారని అన్నారు. ప్రజలు వాస్తవాలను గ్రహిస్తున్నారని, వారి దృక్పథంలో మార్పు కనిపిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొద్దు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సీహెచ్ జ్ఞానారెడ్డి, నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు మిరియాల దిలీప్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్ కాంతారావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఎం గురుబ్రహ్మం, సోషల్ మీడియా కన్వీనర్ బుల్లా దాసు, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, తుమ్మూరి వెంకట్రామిరెడ్డి, పి వినోద్‌రెడ్డి, గోలి రామకృష్ణారెడ్డి, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ దుర్గారావు,జి రాజేష్ నాయుడు, డోకల రాము, గొట్టాపు బాబు, శ/వరామకృష్ణ, కాన్వెంట్ రాజు, పేర్రాజు, గొంది రాజు, ప్రకాష్, కె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి



కోర్టు ఆవరణంలో లోక్ అదాలత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జూలై 5వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం కోర్టు ఆవరణంలో న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. ప్రతిరోజూ కోర్టు ఆవరణలో నిర్వహించే ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్‌లో కేసులు రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే మాణిక్యాలరావు, న్యాయవాదులు, కోర్టు సూపరిండెంట్ పీజీ నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



వాహనదారుల పత్రాలు తనిఖీ చేస్తున్న ఎస్సై చెన్నారావు

కామవరపుకోట: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. సోమవారం స్థానిక దుర్గ మహల్ సెంటర్లో ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. రోడ్డు భద్రత నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ తనిఖీలో సరైన పత్రాలు లేని వాహనదారులపై కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం చట్టరీత్యా నేరమని, చిన్నారులకు వాహనాలు ఇస్తే వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలు కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు.


రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి



పోలవరం వ్యవసాయ కార్యాలయంలో రైతు జాబితాను అందజేస్తున్న వ్యవసాయ అధికారి

పోలవరం రూరల్: 2025-26 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ప్రారంభించినట్లు పోలవరం ఏవో కె.రాంబాబు తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో అన్నదాత సుఖీభవ పథకం జాబితాను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పోలవరం మండలానికి సంబంధించి 5,161 మంది రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. రైతు సేవా కేంద్రంలో ఉన్న గ్రామ సిబ్బందితో ఈ-కేవైసీ పూర్తి చేసిన తదుపరి మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. రైతు ఖాతాకి అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ అవుతాయన్నారు. మండలంలోని రైతులందరూ తక్షణమే రైతు సేవ కేంద్రం దగ్గరకు వెళ్లి వేలిముద్ర వేసి ఈ-కేవైసీ చేయించుకోవాలని కోరారు. గూటాల, కొత్త పట్టిసీమలో 1,517 మంది రైతులు, పోలవరంలో 1174, పట్టిసీమలో 646, ప్రగడపల్లిలో 534 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈకేవైసీకి ఈ నెల 20వ తేదీ వరకు మాత్రమే అవకాశముందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ముంజులూరులో పోషణ్ బీ ప్యాకెట్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని గిరిజనులు అభివృద్ధి చెందాలని ఎంపీడీఓ కె. జ్యోతి, తహసీల్దార్ పీవీ చలపతిరావు అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన ముంజులూరులో సోమవారం డార్తీ ఆబా జనభాగీదారి అభియాన్, పీఎమ్ జన్మాన్ మండల లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ అండ్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వం ద్వారా కొండరెడ్డి గిరిజనుల అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం పోషణ్ బీలో అర్హులైన వారికి పోషణ్ ప్యాకెట్‌లు అందజేశారు. కాగా పులిరామన్నగూడెం నుంచి ముంజులూరు వరకూ రహదారి అధ్వానంగా ఉండడంతో గ్రామ సభలకు హాజరైన అధికారులు నానా అవస్థలు పడ్డారు.

మోటార్‌సైకిల్ చోరీ కేసులో ముద్దాయికి జైలు శిక్ష

జంగారెడ్డిగూడెం: మోటార్‌సైకిల్ చోరీ కేసులో నిందితుడికి జంగారెడ్డిగూడెం కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన తాడేపల్లి చిట్టిబాబు మోటార్‌సైకిల్ చోరీ చేయగా అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితుడు చిట్టిబాబు నేరం రుజువు కావడంతో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ తేజస్విని నాలుగు నెలలు జైలు, రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్సై చెప్పారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



రెడ్డిగూడెంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: పోడు భూములకు పట్టాలివ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ డిమాండ్‌చేశారు. సోమవారం రెడ్డిగూడెంలో నిర్వహించిన సీపీఐఎంఎల్ మాస్ లైన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాలతో పాటు మిగతా ఏజెన్సీ అన్ని మండలాల్లో గత 50 సంవత్సరాల నుంచి పోడు భూముల్లో పంటలు వేసి అనుభవిస్తున్న సాగుదారులకు పట్టాలివ్వకుండా గత ప్రభుత్వాలు కాలయాపన చేశాయన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఆదివాసీల సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పి ఏడాది గడుస్తున్నప్పటికీ, పట్టాలు ఇవ్వలేదని, జిల్లాలో అనేక ప్రాంతాల్లో పోడు సాగుదారులపై అటవీ అధికారులు బెదిరింపులు చేస్తున్నారని, కొంత మంది అధికారులు సాగుదారుల వద్ద పెద్ద మొత్తంలో డిమాండ్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి అక్రమాలు దౌర్జన్యాలు మానుకోవాలని, అధికారులను కోరారు. ఈ సమస్య పై ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టి పోడు సాగు దారులందరికి పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీజిల్లా నాయకులు గడ్డల ముత్యాలరావు, కట్టం వీరాస్వామి, పోలవరం, జంగారెడ్డిగూడెం పార్టీ డివిజన్ల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

చోరీ సొత్తు బాధితులకు అందజేత



చోరీ సొత్తును బాధితులకు అందజేస్తున్న ఎస్పీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం, పోలవరం సబ్ డివిజన్ పరిధిలో జరిగిన పలు దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లో కోల్పోయిన బంగారు ఆభరణాలను సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కేపీఎస్ కిషోర్ బాధితులకు అందజేశారు. జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో జంగారెడ్డిగూడెం, తడికలపూడి, ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీలు, రెండు దోపిడీలు, చైన్ స్నాచింగ్‌లు సంబంధించి మొత్తం 322.670 గ్రాముల బంగారం, రూ. 6,30,092 నగదు, ఒక మొబైల్ ఫోన్ బాధితులకు అందజేశారు. అలాగే పోలవరం సబ్‌డివిజన్ పరిధిలోని పోలవరం పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి జరిగిన ఒక భారీ చోరీ కేసులో బంగారం, వెండి, నగదు కలిపి మొత్తం రూ. 32లక్షలు సొత్తును బాధితులకు ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు ఎస్పీకి , పోలీస్ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. డీఎస్పీలు యు.రవిచంద్ర, ఎం.వెంకటేశ్వరరావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి

కొయ్యలగూడెం: ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు రెండు వందల రోజుల పనులు, రూ.600 దినసరి వేతనం ఉండేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికై జూలై 9న చేపట్టే రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పని ప్రదేశాల్లో కూలీల వద్దకు వెళ్లి వాళ్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆకుల దుర్గారావు, ఆకుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

200 రోజులు పని కల్పించాలి

కామవరపుకోట: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఏడాదికి 200 రోజులు పని కల్పించి రోజు కూలి రూ.700 ఇవ్వాలని బీకేఎంయూ మండల అధ్యక్షుడు కరేటి నరసింహులు, సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రత్నగిరి నగర్‌లో ఉపాధి హామీ పథకం పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు బకాయిపడిన కూలీ డబ్బులను తక్షణమే చెల్లించాలని డ్వామా అధికారులను కోరారు. ఉపాధి హామీ కూలి డబ్బులను బ్యాంకుల్లో కాకుండా పోస్ట్ ఆఫీస్ ద్వారా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ.. దుకాణదారులకు నోటీసులు



దుకాణదారులకు నోటీసులు ఇస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: కన్నాపురం రోడ్డు విస్తరణకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఈనేపథ్యంలో ఇరువైపులా దుకాణదారులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కె.సురేష్ సోమవారం పేర్కొన్నారు. రోడ్డు ఆక్రమణలతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ కలెక్టర్‌కి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విస్తరణ పనులకు ఆదేశాలు జారీ చేశారన్నారు.

సర్వేపై అభ్యంతరాలు

కన్నాపురం రోడ్డు విస్తరణ అంశం వివాదంగా మారిందని, రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మద్దు మోహన్ సోమవారం ఆరోపించారు. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుదారుడు కన్నాపురం రోడ్డులో డ్రెయినేజీ ఆక్రమణలకు గురైందని, వాటిపై ఏర్పాటు చేసుకున్న దుకాణాలు తొలగించాలని పేర్కొన్నాడన్నారు. కానీ కావాలనే కొందరు ఎఫ్ఎంబీ వరకు రోడ్డు విస్తరణ చేయాలంటూ వివాదాన్ని రేపారన్నారు. బదిలీపై వెళ్లిన తహసీల్దార్ చెల్లన్న దొరను గతంలో దీనిపై వివరణ కోరగా డ్రెయినేజీల ఆక్రమణలు తొలగిస్తే సరిపోతుందని అన్నారని, కలెక్టర్ ఆదేశాలు కూడా అదే విధంగా వచ్చాయన్నారన్నారు. కానీ కొందరు స్వార్థం కోసం సమస్యను జటిలం చేస్తున్నారని ఆరోపించారు.

ఇజ్రాయెల్ దురాక్రమణపై నిరసన

జంగారెడ్డిగూడెం: సామ్రాజ్యవాద, దురాక్రమణ చర్యలకు పాల్పడుతూ వర్ధమాన దేశాలపై దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ చర్యలను ఖండిస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు అన్నారు. ఈమేరకు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి మద్దతిస్తూ మానవ హనన దురాగతాలను కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ వెంటనే యుద్ధోన్మాద చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సముద్రాల సుందరరావు, సాలి రాజశేఖర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సీడీపీఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓగా బాధ్యతలు చేపట్టిన యూఎన్‌వీ పద్మావతిని బుట్టాయగూడెం మండల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీడీపీఓకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

కె.కోట ఏవోగా ముత్యాలరావు

కామవరపుకోట: కామవరపుకోట మండల వ్యవసాయ అధికారిగా డి.ముత్యాలరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బుట్టాయిగూడెం ఏవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో టి.నరసాపురం మండల ఏవోగా పనిచేస్తూ కామవరపుకోటకు ఇన్‌చార్జిగా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన సి.పవన్ కుమార్ జంగారెడ్డిగూడెం ఏవోగా వెళ్లారు.

కొయ్యలగూడేనికి పోశారావు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండల వ్యవసాయ శాఖ అధికారిగా కేవీఎస్ పోశారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జంగారెడ్డిగూడెం నుంచి బదిలీపై రాగా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో అభినందించారు. గతంలో 2017-19 వరకు కొయ్యలగూడెంలో ఆయన పనిచేశారు.

చెత్త డంపింగ్ నిలిపివేయాలంటూ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాసర్ పాషా

టి.నరసాపురం: టి.నరసాపురం రోడ్డులో గుర్రాజు కుంట వద్ద చెత్త డంపింగ్ నిలిపివేయాలని సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా డిమాండ్ చేశారు. సోమవారం చింతలపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన నిరసన తెలిపి అధికారులకు వినతి పత్రం అందజేశారు. నాసర్ పాషా మాట్లాడుతూ గ్రీవెన్స్‌ల ద్వారా ఎన్నిసార్లు మొత్తుకున్నా చెత్త డంపింగ్ నిలిపివేయలేదని, రాకపోకలకు అంతరాయంగా చెత్త డంప్ చేస్తున్నారని, అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ డీఎల్ ప్రమద్వరకు, చింతలపూడి మున్సిపల్ కమిషనర్ రాంబాబుకు వినతిపత్రాలు అందజేశారు.